క్లుప్తంగా

దీపికను కలిసిన మధుమతిరెడ్డి



సమన్వయకర్త దీపికను సత్కరించిన మధుమతిరెడ్డి

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపికను రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి శనివారం సాయంత్రం దీపిక నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తాజాగా మధుమతిరెడ్డికి పార్టీలో కీలక పదవి రావడంతో దీపిక శుభాకాంక్షలు తెలిపారు. ఇరువురు ఒకరికొకరు శాలువాలతో సత్కరించుకున్నారు. పార్టీ అభివృద్ధి కోసం కలిసి పని చేద్దామని మధుమతితో దీపిక అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి , పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంఈఓ గంగప్పకు విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో పలు కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ముందస్తు ప్రచారాలు, అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయన్నారు. అలాగే అధిక ఫీజులు వసూలు చేస్తూ పాఠశాల ఆవరణలోనే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, టైలు, షూలు, ఇతర సామాగ్రి విక్రయిస్తున్నారన్నారు. ఇలాంటి విద్యాసంస్థలపైన విద్యాశాఖాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ నాయకులు వరుణ్, పవన్, గోపి, రాజేష్; చరణ్, తిమ్మన్న పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ మండల కమిటీ ఎన్నిక



ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

లేపాక్షి: మండల పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి బాబావలి ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విక్రమ్ నందీష్, ఉపాధ్యక్షులుగా శివ,నాగేంద్ర, దేవా , సహాయ కార్యదర్శులుగా నరేష్, సుహేల్, అంజి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి విద్యార్థులను కలుపుకుని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం పోరాడుతూ విద్య ప్రైవేటీకరణ , కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా భవిష్యత్‌లో ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సన్మానం



డిపో మేనేజర్‌ని సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: మడకశిర ఆర్టీసీ డిపో మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రంగభాష్యంను ఎస్ఎంయూ నాయకులు శనివారం సన్మానించారు. ఈసందర్భంగా ఎస్ఎంయూ నాయకులు డిపో సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. డిపో అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఎంయూ నాయకులను డిపో మేనేజర్ కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంయూ అధ్యక్షుడు ముద్దప్ప, కార్యదర్శి రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి జయసింహ తదితరులు పాల్గొన్నారు.

చర్మకారుల సేవా సంఘం జనరల్ సెక్రటరీగా అనిల్‌కుమార్

హిందూపురం: శ్రీ సత్య సాయి చర్మకారుల సేవా సంఘం జిల్లా జనరల్ సెక్రటరీగా హిందూపురం పట్టణానికి చెందిన అనిల్‌కుమార్‌ను నియమించారు. చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ పుల్లా రాజారావు నియామక పత్రం అందజేసినట్లు అనిల్ కుమార్ తెలిపారు. జిల్లాలో చర్మకారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

ఈకేవైసీ చేయించుకోండి

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లోని కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలని సీఎస్‌డీటీ నవీన్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జూన్ 30 వరకు గడువు పొడిగించిందన్నారు.

బాలయ్యా.. ప్రజల ఆక్రందన వినవయ్యా

- సమస్యలతో 'పురం' అస్తవ్యస్తం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- నేడు బాలకృష్ణకు అభినందన సభ



కొట్నూరులో మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి నిర్మిస్తున్న షెడ్లు



భూమయ్యగారిపల్లిలో బోరుబావుల వద్ద నీళ్లు పట్టుకుంటున్న దృశ్యం(ఫైల్)

చిలమత్తూరు: హిందూపురం నియోజకవర్గంలో ప్రజలు సమస్యలతో ఆక్రందన చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలో ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా ఈ వేసవి తాగునీటి కష్టాలు తెచ్చిపెట్టింది. నియోజకవర్గంలోని హిందూపురం పట్టణం, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో తాగునీటి కష్టాలు నెలకొన్నాయి. మనుషులకే కాదు.. జీవచరాలకూ నీటి సమస్యలు వచ్చిపడ్డాయి. టీడీపీ నేతలు సొంత లాభాలపైనే దృష్టి సారిస్తుండగా ప్రజా సమస్యలను గాలికి వదిలేశారు. గ్రామాల్లో పొలాల వద్ద ఉన్న బోరుబావుల నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో హిందూపురంలో ఆదివారం ఎమ్మెల్యే బాలకృష్ణకు పద్మభూషణ్ సన్మాన సభ ఏర్పాటు చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

వేధిస్తున్న తాగునీటి సమస్య

గ్రామాల్లో తాగునీటి సమస్యలు అధికంగా ఉన్నాయి. చిలమత్తూరు మండలంలో కొత్తచామలపల్లిలో గత పది రోజులుగా తాగునీటి ఇబ్బందులు ఉంటే కార్యదర్శి సావిత్రి డబ్బులివ్వండి నీటి సమస్య పరిష్కరిస్తామని చెప్పే పరిస్థితులు ఏర్పడటం దురదృష్టకరం. ఎస్.ముద్దిరెడ్డిపల్లిలో 20 రోజులుగా తాగునీటి సమస్యలు నెలకొన్నా.. సమస్య పరిష్కరించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ ఖజానా ఖాళీగా ఉండటంతో సర్పంచ్‌లు, అధికారులు చేతులెత్తేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఇక నేతల కథ వేరే చెప్పక్కరలేదు. అస్సలు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఇన్‌చార్జి అధికారులతో పాలన అస్తవ్యస్తం

నియోజకవర్గంలో పనిచేసే అధికారులు రెండు చోట్ల, మూడు చోట్ల ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తుండటంతో ప్రజల సమస్యలు తీరడం లేదు. తహసీల్దార్ కార్యాలయం మొదలు, ఎంపీడీఓ కార్యాలయం వరకూ ఇన్‌చార్జ్‌ల పాలన నడుస్తోంది. చిలమత్తూరు మండలంలో తహసీల్దార్, ఎంపీడీఓ ఇద్దరూ ఇన్‌చార్జ్‌లు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏ సమస్య చెప్పుకోవాలన్నా అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేతల భూ ఆక్రమణలు

హిందూపురం నియోజకవర్గం వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నేతలు చేస్తున్న భూ ఆక్రమణలు అనేకంగా ఉన్నాయి. హిందూపురం పట్టణం కొట్నూరులో మున్సిపాలిటీ స్థలాన్ని యథేచ్ఛగా కబ్జా చేసేశారు. ఏకంగా షెడ్‌లు వేసి వ్యాపారాలకు అనువుగా మార్చుకున్నారు. ముద్దిరెడ్డిపల్లిలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఓ టీడీపీ నేత సామాన్యులను ఇబ్బందులకు గురిచేశారు. చిలమత్తూరు మండలంలో ఒకరి భూములు మరొకరికి 1 బీ లు చేయించుకుని అక్రమాలు చేస్తున్నారు. ఇవన్నీ బాలయ్యకు తెలుసో లేక వీళ్లే దాచేస్తున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి.

మారని చుట్టు చూపు పర్యటనలు

ఎమ్మెల్యే బాలకృష్ణ చుట్టం చూపు పర్యటనలు కొనసాగుతున్నాయి. ఆయన నియోజకవర్గంపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. తాజాగా పద్మభూషణ్ అభినందన సభ ఏర్పాటుతో మళ్లీ హిందూపురం మొఖం చూస్తున్నారు. ఇలా ఐదేళ్లలో ఆయన పర్యటనలు వేళ్లతో లెక్కపెట్టవచ్చని ప్రజలే విమర్శలు గుప్పిస్తున్నారు. ఆయన పీఏలు సైతం పురంలో నెలకొన్న సమస్యలపై ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

రేషన్ కోతలు

నియోజకవర్గంలో ప్రభుత్వం అందించే రేషన్ సరుకుల్లో కోతలు పెరిగిపోయాయి. డీలర్లు సంచులు పెట్టి తూకాలకు మోసాలకు పాల్పడుతుండగా, బియ్యం లబ్ధిదారులకు ఇవ్వాల్సిన దానికంటే తక్కువ స్టాక్ రావడంతో మరింత కోతలు పెడుతున్నారు. కందిపప్పును డీలర్లు లబ్ధిదారులకు ఇవ్వకుండా బయట బ్లాక్ మార్కెట్‌లో తరలిస్తుండగా, మరికొందరు అధిక ధరలకు విక్రయించుకుని ప్రజలపై భారాన్ని మోపుతున్నారు. స్థానికేతరుల పరిస్థితి మరీ దారుణంగా మారడంతో రేషన్ తీసుకోవడమే మానేసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం లలో ప్రజలు రేషన్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల్లో ఇంటింటికీ సరుకులు పంపిణీ చేయకపోవడంతో ఎండలోనే క్యూ లైన్‌లో నిలబడుతూ లబ్ధిదారులు అస్వస్థతకు గురవుతున్నారు.

సభ కోసం రూ.కోట్ల ఖర్చు..



ఎమ్మెల్యే బాలకృష్ణ సభ కోసం అధికారులు, పార్టీ నేతలు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. తాగునీటి సమస్యలు తీర్చేందుకు నిధులు లేవంటున్నారు. రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదు. సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయి. ఆ సొమ్మంతా ఆయా ప్రాంతాల ప్రజలకు ఇస్తే వారి సమస్యలు తీరుతాయి కదా...? ఎమ్మెల్యే అభినందన సభ తర్వాతైనా ప్రజల కష్టాలపై దృష్టి సారిస్తే బాగుంటుంది.

– టీఎన్ దీపిక, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త

కంపచెట్ల తొలగింపు



శ్మశాన వాటికకు వెళ్లే దారిలో కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని కంబాపపల్లి గ్రామంలో శ్మశాన వాటికకు వెళ్లే రహదారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్ల తొలగింపునకు శనివారం చర్యలు తీసుకున్నారు. ఇటీవల సమస్యను మంత్రి సవిత దృష్టికి సర్పంచ్ మంజునాథ్, తదితరులు తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి జేసీబీలు ఏర్పాటు చేసి దారికి ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించారు.

వర్షానికి కూలిన పై కప్పు



సోమందేపల్లి: మండల కేంద్రంలోని మారుతి నగర్‌లో శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి గంగరత్నమ్మ ఇంటి పై కప్పు కూలింది. ఇంటిలో ఆమె తన కూతురుతో కలిసి నిద్రిస్తుండగా మరో గదిలో పెద్దగా శబ్దం వచ్చింది. గమనించిన తల్లీబిడ్డ బయటకు వచ్చేయడంతో పెను ప్రమాదం తప్పింది. వర్షపు నీరు ఇంట్లోకి రావడంతో నిత్యావసరాలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని గంగరత్నమ్మ కోరుతోంది. స్థానిక వాల్మీకి సంఘం నాయకుడు చంద్రశేఖర్ స్పందించి నెలకు సరిపడా వంట సామాగ్రి తోపాటు రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

వాహనాల తనిఖీ

అగళి: మండలంలోని మడకశిర రోడ్డులో ఏఎస్ఐ భాషీర్ సిబ్బందితో కలిసి శనివారం వాహనాల తనిఖీ చేశారు. వాహనలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు. అనుమతి లేకుండా తిరుగుతున్న వాహనాలు, నంబర్ ప్లేట్ వాహనాలను గుర్తించారు. నిబంధనలను అతిక్రమించి వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని ఏఎస్ఐ హెచ్చరించారు.

ముని్సిపల్ అధ్యక్షుడిగా సుదేశ్ కుమార్ ఏకగ్రీవం



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

పావగడ: స్థానిక మున్సిపల్ నూతన అధ్యక్షుడిగా 4 వ వార్డు కౌన్సిలర్ జీ సుదేశ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధ్యక్ష స్థానానికి శనివారం జరిగిన ఎన్నికల్లో ఆయన ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు అధికారికంగా ప్రకటించారు. తాజా మాజీ అధ్యక్షుడు రాజేశ్ పదవీ కాలం ముగియడంతో మరు ఎన్నిక అనివార్యమైంది. నూతన అధ్యక్షుడు సుదేశ్‌కుమార్‌ను స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్ తదితర కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు సన్మానించారు. ఇదిలా ఉంటే సుదేశ్‌కుమార్ తండ్రి జీఎస్ ధర్మపాల్ 18 ఏళ్లుగా మున్సిపల్ అధ్యక్షుడిగా, 40 ఏళ్లు మున్సిపల్ కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై అప్పటి కేంద్ర మంత్రి సీతారాం కేసరి నుంచి ఉత్తమ పరిపాలన అవార్డు అందుకున్నారు. అతని తాత శంకర శెట్టి సైతం మున్సిపల్ అధ్యక్షుడిగా పదవి అలంకరించారు. కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుదేశ్‌కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రతకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. పట్టణంలో వార్డుల్లో పర్యటించి చెత్త రోడ్డుపైకి వేయకుండా చెత్త సరఫరా వాహనాల్లోకి వేసేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు.

శౌచాలయాలు నిర్మించకపోవడం సిగ్గుచేటు



విలేకరులతో మాట్లాడుతున్న మహిళా మండలి అధ్యక్షురాలు

పావగడ: తాలూకాలోని కేటి హళ్లి గ్రామ పంచాయతీకి చెందిన ముగదాళబెట్ట గ్రామం గొల్లరహట్టిలో ఇళ్లకు నేటి వరకు శౌచాలయాలు నిర్మించక పోవడం సిగ్గుచేటని రాష్ట్ర మహిళా మండలి అధ్యక్షురాలు డా నాగలక్ష్మి చౌదరి మండిపడ్డారు. శనివారం ఆమె గొల్లరహట్టి కుగ్రామాన్ని పర్యటించారు. అక్కడి సమస్యలను ప్రజలనే అడిగి తెలుసుకున్నారు. సుమారు 40 సంవత్సరాలుగా రెండెకరాల సర్కారు భూమిలో సొంతంగా ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని, అయితే మా ఇళ్లకు ఇంత వరకూ ఖాతాలు ఇవ్వలేదని గ్రామస్తులు వాపోయారు. గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో ఇంత వరకు రోడ్లు, వీధి దీపాలు, శౌచాలయాలు, చరండిలు నిర్మించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు అన్నారు. మహిళా మండలి అధ్యక్షురాలు నాగలక్ష్మి చౌదరి మాట్లాడుతూ వెంటనే గొల్లరహట్టికి మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామ ప్రజలను ఆదుకోవాలని తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకి రాంను డిమాండ్ చేశారు. తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకీరాం తదితర గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు. రైతు సంఘం నాయకుడు పూజారప్ప గ్రామ సమస్యలను మండలి అధ్యక్షురాలికి విన్నవించారు.

ఈరలక్కప్పకు సన్మానం



ఈరలక్కప్పను సన్మానిస్తున్న నాయకులు

గుడిబండ: మండలంలోని ఫళారం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్పను పార్టీ శ్రేణులు శనివారం సన్మానించారు. వలంటీర్స్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడిగా లక్ష్మీనరసప్ప నియమించారు. దీంతో ఈరలక్కప్ప, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్‌ను సన్మానించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. కార్యక్రమంలో మందలపల్లి సర్పంచ్ అశ్వత్థ, మాజీ వార్డు మెంబర్ చిత్తప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవరాజు, ఈరక్యాతప్ప, మూడ్లగిరియప్ప, ముద్దరాజు, నాగరాజు, హరీష్, శీనప్ప, తిప్పేస్వామి పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి



బీజీ హళ్లిలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

రొళ్ల: తల్లిదండ్రులు కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. శనివారం బీజీ హళ్లి రైతు భరోసా కేంద్రం ఆవరణలో కిశోర బాలికల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. సీడీపీఓ నాగమల్లేశ్వరి మాట్లాడుతు అప్పుడే పుట్టిన బిడ్డ వయస్సు నుంచి 1000 రోజుల సంరక్షణపై అవగాహన కల్పించారు. పిల్లలలో లోపాపోషణ గుర్తించడం, వైద్యుల సలహాలు తీసుకోవడం, ఏమైనా సమస్యలు ఉంటే రెఫర్ చేయడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతను పాటించాలని సూచించారు. తర్వాత బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలు, కిశోర బాలికలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవాహన కల్పించారు. జూన్ 10 వరకు కిశోర వికాసంపై అంగన్‌వాడీ కేంద్రాల వారీగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సన్నమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు నాగమణి, మంజుళ, రత్నమ్మ, శివమ్మ, కిశోరి బాలికలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుట్టే లక్ష్మీదేవి ఉత్సవాలు ప్రారంభం





ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం, అలంకరణలో గుట్టే లక్ష్మీదేవి అమ్మవారు

రొళ్ల: మండల పరిధిలోని పిల్లిగుండ్ల గ్రామ సమీపంలో వెలసిన గుట్టే లక్ష్మీదేవి ఉత్సవాలు శనివారం సాయంత్రం నుంచి ప్రారంభమయ్యాయి. తొలుత వారం రోజుల ముందే ఆలయానికి రంగులు పూసి ముస్తాబు చేశారు. దాదాపు 12 ఏళ్ల తర్వాత గుట్టే లక్ష్మీదేవి ఉత్సవాలు జరుపుకుంటుండడం విశేషం. ప్రారంభం రోజున లక్ష్మీదేవి మూల విగ్రహానికి అభిషేకించారు. తర్వాత వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. సాయంత్రం జరిగిన ఉత్సవానికి శిర తాలూకా పట్టనాయకనహళ్లి(స్ఫటికపురి) కుంచిగ వక్కలిగ సంస్థానం గురుగుండ బ్రహ్మేశ్వరస్వామి మఠాధిపతి నంజావధూత మహాస్వామిజీ ముఖ్య అతిథులుగా హాజరై ధ్వజ స్తంభాన్ని ప్రారంభిస్తారు. ఆదివారం అశ్వత్థకట్ట నాలుగు ప్రతిష్టాపన మహోత్సవం, ఆలయం శిఖరాన విమాన గోపురం ప్రారంభోత్సవం, ప్రతిభ పురస్కారాలు ప్రాధానం, కళసోత్సవం నడుమ 7 బండిలు ఆలయానికి ప్రవేశం, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు, సోమవారం ఉదయం జలధి ఉత్సవం, దాతలకు సన్మానంతో పాటు ఉత్సవానికి హాజరైన భక్తులకు అన్నదానం ఉంటుంది.

ఇంటర్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

లేపాక్షి: స్థానిక మహాత్మాజ్యోతిబా పూలే ఏపీ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించే ఇంటర్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రిన్సిపాల్ సుందరరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేంద్రానికి 701 మంది విద్యార్థులను కేటాయించారన్నారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష 10 గంటల నుంచి 12 గంటల వరకూ జరుగుతుందన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్, ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

ఉషశ్రీచరణ్‌కు కృతజ్ఞతలు



పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకుల్లు

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ మండల కమిటీలో చోటు దక్కించుకున్న పార్టీ మండల ఉపాధ్యక్షుడు జే.చెన్నకేశవులు, సెక్రటరీ కురుబ ఆంజనేయులు శనివారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌ను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండల కమిటీలో తమకు చోటు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

పెనుకొండ రూరల్: అక్రమంగా తరలిస్తున్న 18 బాక్స్‌ల కర్ణాటక మద్యాన్ని ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ సృజన్ బాబు తెలిపిన వివరాలు.. గోరంట్ల మండలం కోరేవాండ్లపల్లి క్రాస్ వద్ద శనివారం ఎక్సై జ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఓ కారులో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక హేవార్డ్స్ మద్యాన్ని గుర్తించారు. నల్లమాడ గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కారును సీజ్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

నాలుగు జీవాల మృతి



మృతి చెందిన మూగజీవాలు

పావగడ: తాలూకాలోని కన్నమేడి గ్రామ పంచాయతీకి చెందిన హొన్నమేడి లో తీవ్ర ఎండల వేడిమి తాళలేక 3 మేకలు, ఒక గొర్రె మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. రైతు నాగేంద్ర మాట్లాడుతూ ఎండ వేడిమికి తాళలేక 3 మేకలు, ఒక గొర్రె మృతి చెందాయని, రూ.60 వేలు నష్టపోయినట్లు తెలిపాడు.

రేషన్ కష్టాలు..



పరిగిలో రేషన్ సరుకుల కోసం క్యూలో ఉన్న లబ్ధిదారులు

పరిగి: మండలంలో రేషన్ సరుకుల కోసం ప్రజలు నానాతిప్పలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇంటింటికీ రేషన్ సరుకులు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే సరుకులు అందేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంటింటికీ రేషన్ సరుకులు అందడం లేదు. చౌకధాన్య డిపోల వద్ద రేషన్ సరుకుల కోసం ప్రజలు గంటల తరబడి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన విధంగా రేషన్ సరుకులను డోర్ డెలవరీ చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- మహిళకు గాయాలు

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై శనివారం ఆగి ఉన్న లారీని కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ మహిళ గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. బెంగళూరు నుంచి మంత్రాలయానికి వివాహానికి వెళ్లేందుకు కర్ణాటక ఆర్టీసీ బస్సును మాట్లాడుకున్నారు. బస్సు జాతీయ రహదారిపై హరిపురం వై జంక్షన్ వద్దకు రాగానే డ్రైవర్ మరో బస్సును ఓవర్ టేక్ చేయబోయాడు. ఈ క్రమంలో అదుపుతప్పిన బస్సు.. ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో లక్ష్మీదేవి అనే మహిళ స్వల్పంగా గాయపడింది. బస్సు ముందు భాగం స్వల్పంగా దెబ్బతింది.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, మహా మంగళ హారతి ఇచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాద వినియోగం చేశారు. ఇదే గ్రామంలో స్థిరపడిన డీ నాగరాజు కుమారుడు డీఎన్. మనోహర్ రూ.51వేలు ఆలయ నిర్మాణానికి విరాళంగా అందజేశారు.